క్లుప్తంగా

రేపు ఉచిత ధ్యాన శిక్షణ

మోతీనగర్: మోతీనగర్ అవంతినగర్ తోటలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలోని ధ్యాన మందిరంలో 3వ తేదీ గురువారం ఉదయం 11 నుంచి రాత్రి వరకు ఉచిత ధ్యాన శిక్షణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు సాయిరత్న భీమినేని వంశీకిరణ్‌తో దివ్య జ్ఞానామృతం ఉంటుందని తెలిపారు.

డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలపై మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ఏవీబీ పురం కాలనీలో ప్రజా సమస్యలపై అన్ని విభాగాల అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ శ్రావణ్ కుమార్, వాటర్ వర్క్స్ కుమార్, హార్టికల్చర్ అధికారి ప్రియాంక, ఎంమాలజీ సూపర్‌వైజర్ నరేష్, ఎస్ఆర్‌పీ వినయకాంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య, వీధిలైట్ల సూపర్‌వైజర్ భద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసినగర్‌లో కార్పొరేటర్ సబిహా బేగం మంగళవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అ సందర్భంగా అల్లాపూర్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరగా అధికారులను సంప్రదించి సమస్యను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకోవటంతో తక్షణమే నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, సంపత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బంగారు, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, ఇస్మాయిల్, ఖదీర్, సత్తమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫేజ్-2లో ప్యాచ్‌వర్కు పనులు షురూ



ప్యాచ్‌వర్క్ పనులు చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–2 ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్యాచ్‌వర్క్ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ ఫేజ్–2 ప్రధాన రహదారి కావటంతో ఈ రోడ్డులో రద్దీ విపరీతంగా ఉంది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగకుండా వాహనదారులు ఇబ్బంది పడకుండా ప్యాచ్ వర్కు పనులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



ఓల్డ్ బోయిన్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ఆదర్శాలకు ఆకర్షితులై మైనార్టీ యువకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మాజీ అధ్యక్షుడు నల్లోల రాజేందర్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్ యాదవ్, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ మోయిజ్, సత్యం శ్రీరంగం సమక్షంలో 100మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్లం, కృష్ణరాజ్ పుత్, శేకర్, గజనంద్, అశోక్, బిల్లల్, ముస్తఫా, సాయి, ఫీరోజ్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పోకు స్పందన

భాగ్యనగర్‌కాలనీ: హెచ్ఎంటీహిల్స్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శనను వినియోగదారుల నుంచి విశేషస్పందన లభిస్తోందని నిర్వాహకులు వికాస్‌జైన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజలకు అన్ని రకాల ఫ్యాషన్ వస్త్రవులను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ ప్రదర్శన ఆగస్టు 15 వరకు మాత్రమే కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



సమస్య మీది.. పరిష్కారం నాది

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రజలే ఎమ్మెల్యే వద్దకు వెళ్లి వారి సమస్యలను చెబుతుండటం మనం చూస్తుంటాం. కానీ ఎమ్మెల్యేనే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు ఉంటే చెప్పండి. పరిష్కరిస్తానని అడగడం చాలా అరుదుగా చూస్తుంటాం. కానీ ప్రస్తుతం కూకట్‌పల్లి నియోజకవర్గంలో మనం అది చూస్తున్నాం. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం గల్లీ గల్లీకి వెళ్లి ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇది చూసిన అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది శుభపరిణామమని అంటున్నారు.



కాలనీ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం



కాలనీలలో పాదయాత్ర చేస్తూ ప్రజలను కలుస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: 'ప్రజల వద్దకే మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యింది. ఉదయం మొదటగా తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఆయన ఎమ్మెల్సీ నవీన్‌రావుతో కలసి స్వర్ణదామనగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకోవడంతో పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఒక మొక్క నాటి అక్కడి నుంచి ఎమ్మెల్యే పాదయాత్రను కొనసాగించారు. సమస్య మీది పరిష్కారం నాది అనే నినాదం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఓపికగా సమస్యలను విని ఒక్కొక్కటిగా నోట్ చేసుకుంటూ ముందు సాగారు. ఆయనను కలవడానికి ఉత్సాహాన్ని చూపిన వారితో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకున్నారు. ఈ పాదయాత్రలో వస్తున్న చిన్న చిన్న సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపగా ఇతర సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారమార్గం చూపారు.

90శాతం పనులు పూర్తి చేశాం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో చేసిన కోట్లాది రూపాయల అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. మరికొన్నింటికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఏది ఏమైన ప్రజలు తనను ఇంతగా ఆదరిస్తుండం నా జీవితానికి మరో అనందం లేదని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు మక్కాల నర్సింగ్‌రావు. నరేందర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, కర్రె జంగయ్య, మేకల హరినాథ్, ఇర్ఫాన్, బుర్రి యాదగిరి, మేక ఉదయ్ పెద్ద ఎత్తున మహిళలు, ప్రజలు, అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.





పాదయాత్రలో ప్రజలు చెబుతున్న సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

శేరిలింగంపల్లి: ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన కార్మికులు వండి పెట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి మండల సీఐటీయూ కార్యదర్శి కొంగరి కృష్ణ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి హైస్కూల్ వద్ద మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు అక్షయపాత్ర భోజనాన్ని అడ్డుకొని తిరిగి పంపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాల్లో మధ్యాహ్న భోజనం కూడా ఉందన్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో 325 మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారన్నారు. గత 23 ఏళ్ళుగా పనిచేస్తున్నప్పటికీ ఎలాంటి సమాచారం లేకుండా అక్షయపాత్రకు మధ్యాహ్న భోజన సరఫరా బాధ్యతలు ఇవ్వడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీశైలం, షణ్ముకం కిరణ్, వరలక్ష్మీ, గోపీ, యశోద, పద్మ, గౌరమ్మ, శోభ, గాయత్రి, రాణి బాయి, రాములు, షేక్ అలీ, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలలో పోషకాలు పుష్కలం



ర్యాలీలో డాక్టర్లు, వైద్యసిబ్బంది

మెడికవర్ ఆస్పత్రి పిడియాట్రిక్ విభాగం డైరెక్టర్ డా.రవీందర్‌రెడ్డి

మాదాపూర్: బ్రెస్ట్ మిల్క్ ఫీడింగ్ నుంచి పిల్లలకు పోషకాలు పుష్కలంగా లభిస్తాయని మెడకవర్ ఆస్పత్రి పిడియాట్రిక్ విభాగం డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం మాదాపూర్‌లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు సులభంగా జీర్ణమవుతుందన్నారు. కొంతమంది బ్రెస్ట్ ఫీడింగ్ పట్ల ఇంట్రెస్ట్ చూపించడం లేదని, బ్రెస్ట్ ఫీడింగ్ వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. శిశువుకు 6 మాసాల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. దీనివల్ల బ్రెస్ట్ క్యాన్సర్ రిస్క్ తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డాక్టర్లు వంశీ, సవిత, అనిల్, సంజయ్, సంగీత, వైద్యబృందం ర్యాలీలో పాల్గొన్నారు.

దేశం బాగు కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాలి



మాట్లాడుతున్న చింత మోహన్

పంజగుట్ట: దేశంలో నిరుద్యోగం, పేదరికం, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితుల్లో లేరని, వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమికి 300పైగా స్థానాలతో భారీ విజయం సాధిస్తుందని మాజీ కేంద్ర మంత్రి చింత మోహన్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మంచి జరగాలంటే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లాంటి రైళ్లు కాంగ్రెస్ హయాంలో వందలు ప్రారంభించామని కానీ.. అంత ప్రచారం చేసుకోవడం, ఆఖరుకు బోగీలకు రంగులు వేసుకోవడం ఏనాడూ చేయలేదన్నారు. బీజేపీ బోగీలకు కూడా రంగులు వేసుకుని ఎంతకు దిగజారిందో తెలుస్తుందన్నారు. కేంద్రంలో 58 మంది మంత్రులు ఉంటే నరేంద్రమోదీ, అమీత్‌షా ఇద్దరే దేశ ప్రజలకు తెలుసని మిగిలినవారు నామమాత్రంగానే ఉన్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ మధ్యప్రదేశ్, రాజస్థాన్ నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సుస్థిరత మీ చేతుల్లో'



మాదాపూర్: మాదాపూర్‌లోని మెరిడియన్ స్కూల్‌లో స్యాహి ఆర్ట్ అండ్ లిటరరీ ఫెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఇందులో నగరంలో 45 కంటే ఎక్కువ పాఠశాలల నుంచి 2,500 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోగా మరి కొంతమంది వ్యక్తిగతంగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. మెరిడియన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకురాలు రేణుకాబుట్ట, సీఓఓ అమోఘ్ బుట్టా, ప్రిన్సిపల్ కె భవాని, వైస్ ప్రిన్సిపల్ అనితా కమల్ పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారికి ట్రోఫీలు, బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: నియమనిష్టలతో హనుమాన్ చాలీసా, సుందరకాండ పఠనం చేస్తే దుష్టశక్తులు, నరదిష్టి వంటివి దరి చేరవని మార్వాడి మిత్రమండలి ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా సుందరకాండ, భజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

పెంచిన పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ఫీజులు తగ్గించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు డిమాండ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ఫీజులను ఒకేసారి రూ.4 వేల నుంచి రూ.14 వేలు, ఇంజినీరింగ్ కోర్సులు, మరికొన్ని ఇతర కోర్సుల ఫీజులు కూడా రూ.25 వేలకు పెంచడాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఖండించారు. పేద విద్యార్థులు లక్షలాది రూపాయలు యూనివర్సిటీకి ఫీజుల రూపంలో కడితే తప్పా పీజీ, పీహెచ్‌డీ విద్యను చదువుకునే పరిస్థితి లేదని దుయ్యబట్టారు. ఫీజులను పెంచే క్రమంలో కమిటీని ఏర్పాటు చేయలేదని, విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఫీజులను పెంచారన్నారు. దేశంలో ఏ యూనివర్సిటీలో లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఫీజులు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకులతో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు యూనివర్సిటీలో పరిశోధన చేయడానికి అవకాశం కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు.

దుర్గం చెరువులో దూకిన విద్యార్థిని

కాపాడిన లేక్ పోలీసులు, బోటింగ్ సిబ్బంది

మాదాపూర్: కేబుల్‌బ్రిడ్జిపై నుండి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన బాలికను పోలీసులు రక్షించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే బాలిక ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతుంది. మొబైల్ ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తుండడం, ఇన్‌స్టాగాంలో చాటింగ్ చేయడం గమనించిన తల్లి మందలించడంతో మంగళవారం ఉదయం 7.30 గంటలకు కాలేజీకి వెలుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళింది. కాలేజీకి వెళ్ళలేదు అన్న సమాచారం తెలుసుకున్న తల్లి కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక ఫోన్‌ను ట్రాక్ చేసిన పోలీసులు దుర్గం చెరువు వద్ద ఉన్నదని తెలియడంతో మాదాపూర్ పోలీసులుకు సమాచారం అందించారు. దీంతో మాదాపూర్ ఐసీ సమాచారం మేరకు లేక్ పోలీసులు, బోటింగ్ సిబ్బంది, ఐటీ మొబైల్ స్టాఫ్ అప్రమత్తమై చెరువులోకి దూకిన బాలికను రక్షించి చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోండి



ఇండిస్ వన్‌సిటీ ఎదుట నీటి నిల్వ సమస్యను జెడ్‌సీ మమతకు వివరిస్తున్న స్థానికులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని ఇండిస్ వన్ సిటీ ప్రధాన గేటు ప్రవేశద్వారం ముందు వర్షాలు కురుస్తున్నప్పుడు భారీ నీరు అడ్డుపడుతోందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అపార్టుమెంట్ వాసులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. ఈ నీటితో సెల్లార్, పార్కింగ్ ప్రాంతంలోకి వర్షపు నీరు చేసి ఇబ్బంది కలుగుతోందన్నారు. నీటి ఎద్దడి కారణంగా పాఠశాల విద్యార్థులు బస్సుల్లో వెళ్లేటప్పుడు.. వచ్చేటప్పుడు తల్లిదండ్రులు లోతైన నీటిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

◆ ప్రధాన ద్వారం ముందు వర్షపు నీరు నిలిచిపోవటంతో సమస్యను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇవ్వాలని కోరామన్నారు. సుమారు 250 మంది విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులో వెళ్తారని వీరికి ఒక బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. మంగళవారం ఈ ప్రాంతాన్ని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమత వన్‌సిటీ నివాసితులతో పరిశీలించారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హైదర్‌నగర్ డివిజన్‌ను అభివృద్ధి చేస్తా



యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీలో చేపడుతున్న యూజీడీ పైపులైన్ నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి మంగళవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. అదే విధంగా డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, సైదేశ్వర్‌రావు, కాలనీ వాసులు సుబ్బయ్య, ప్రసాద్, సతీష్, శ్రీనివాస్, బీఎం రావు, తేజరాం, జైన్, కోటయ్య, పిఎస్ నాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు



తొలిమెట్టు వర్క్స్, హ్యాండ్‌బుక్స్ అందజేస్తున్న డీఈఓ విజయకుమారి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఒకటి నుంచి 5వ తరగతుల వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం నుంచి 8వ తేదీ వరకు మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో విద్యార్థుల కోసం తయారు చేసిన వర్క్ బుక్కులు, ఉపాధ్యాయుల కోసం రూపొందించిన హ్యాండ్ బుక్స్‌ను ఉపాధ్యాయులకు ఆమె అందజేశారు. ఈ వర్క్ బుక్స్‌ను ప్రతి విద్యార్థికి అందజేసి వాటిని ఏ విధంగా పాఠశాలలో ఉపయోగించాలో తెలపాలని డీఈఓ విజయకుమారి పేర్కొన్నారు. జిల్లాలోని 15 మండల కేంద్రాల్లో తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులపై రెండు రోజుల చొప్పున శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

విశ్వరూప సభను జయప్రదం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఆగస్టు రెండో వా రంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ కోరారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎ స్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

సనత్‌నగర్: సీఎంఆర్ఎఫ్ పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద బలకంపేటకు చెందిన రవికుమార్‌కు వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల మంజూరు పత్రాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రూప్-2 వాయిదాకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–2 రాత పరీక్ష వాయిదా వేయాలని టీఎస్ విద్యార్థి జేఏసీ చైర్మన్ మిడతనపల్లి విజయ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో చైర్మన్‌తో పాటు ఇతర అధికారులను తొలగించకుండా పరీక్షలు నిర్వహించడంపై అసెంబ్లీలో చర్చించాలని వినతిలో కోరారు. ప్రిపరేషన్ కోసం మూడు నెలలు వాయిదా వేయించాలన్నారు.

జూబ్లీహిల్స్ సీఐగా వెంకటేశ్వర్‌రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహి ల్స్ ఇన్‌స్పెక్టర్‌గా2004 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విధులు నిర్వహించారు. గతంలో పంజగుట్ట, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ సీఐగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి పదోన్నతిపై డీఎస్పీగా డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వెంకటేశ్వర్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఏసీపీ హరి ప్రసాద్, వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



దళితబంధు లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దళితబంధుతో ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- రెండో విడతలో 1100 మందికి లబ్ధి

ఓల్డ్ బోయిన్‌పల్లి: దళితబంధు ద్వారా లబ్ధి పొందుతున్న వారు ఆర్థికంగా ఎదగటంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లబ్ధిదారులను కోరారు. ఓల్డ్ బోయిన్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, బేగంపేట డివిజన్లకు సంబంధిచిన 500 మంది దళితబంధు రెండో విడత లబ్ధిదారులతో మంగళవారం బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో రెండో విడతలో 1100 మంది లబ్ధిదారులకు దళితబంధు అందజేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో బుధవారం నుంచి అధికారులు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. సర్వే అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికి దళితబంధు అందజేస్తామన్నారు.

◆ అనంతరం మేడ్చల్- మల్కాజ్‌గిరి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ మాట్లాడుతూ. దళితబంధు లబ్ధిదారులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులకు అందిస్తున్న యూనిట్లపై వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్‌పల్లి, ఫతేనగర్, బాలానగర్, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ, బేగంపేట్, అల్లాపూర్, కూకట్‌పల్లి డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

